

పట్టభద్రుల స్థానానికి ఆరు నామినేషన్లు



మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం, కడప, కర్నూలు పశ్చిమ రాయలసీమ మండలి ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం నాడు కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో నామినేషన్ పత్రాలను ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్ సీవకరించారు. ఇందులో భాగంగా పట్టభద్రుల స్థానానికి ఆరు, ఉపాధ్యాయ స్థానానికి ఒక నామినేషన్ దాఖలు అయ్యింది. ఉపాధ్యాయ స్థానానికి సందె మాధవరావు నామినేషన్ వేశారు. ఇక పట్టభద్రుల స్థానానికి సంబంధించి పోతుల నాగరాజు, ఎం.ఆనంద్ కష్ణ, పిల్లకదపు చంద్రశేఖర్, రాగిరి చంద్రప్ప, సల్కాపురం అమత్ కుమార్, నల్లాని రమేశ్ నాయుడులు నామినేషన్లు వేశారు.



కాలువలోకి బోల్తాపడ్డ స్కూల్ బస్సు

బడిబస్సు బోల్తా.. విద్యార్థికి తీవ్రగాయాలు

తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి - కనగానపల్లి

మండలంలోని బద్దలాపురం సమీపంలో స్కూల్ బస్సు బోల్తా పడిన ఘటనలో ఓ విద్యార్థి తీవ్ర గాయల పాలయ్యాడు. మరో 14మంది విద్యార్థులు ప్రమాదం నుండి బయట పడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు... తగరకుంట గ్రామంలోని రోహిత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుంచి 15మంది విద్యార్థులతో స్కూల్ బస్సు నర్సంపల్లికి వెళ్తోంది. మార్గ మధ్యలో బద్దలాపురం సమీపంలో హంద్రీ నీవా కాలువ వద్దకు రాగానే అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అమర్ అనే మూడవ తరగతి విద్యార్థికి తీవ్ర గాయాలు అయ్యాయి. మిగిలిన 14 మంది విద్యార్థులు ప్రమాదం నుండి బయట పడ్డారు. వెంటనే స్థానికులు గమనించి గాయపడిన విద్యార్థిని తగరకుంట ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కనగానపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మంగమ్మకు మండలి అవకాశం

స్థానిక సంస్థల కోటాలో వైసిపి అభ్యర్థిగా ప్రకటన

ప్రజాశక్తి-పెనుకొండ

అనంతపురం జిల్లా స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా హిందూపురం మాజీ ఎంపీ సానిపల్లి గంగాధర్ సతీమణి సానిపల్లి మంగమ్మ పేరును ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ మేరకు సోమవారం పేరును ఖరారు చేశారు. బీసీ బోయ సామాజిక వర్గంలో బలమైన నేతగా మంగమ్మ కుటుంబం ఉంది. మంగమ్మ భర్త సానిపల్లి గంగాధర్ హిందూపురం పార్లమెంట్, పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజలకు సుపరిచతమైన నేత. పెనుకొండ నియోజకవర్గం గుట్టూరు సింగిల్ విండో అధ్యక్షునిగా ఈయన రాజకీయ అరంగేట్రం చేశారు. అనంతరం 1989, 1891, 1998 సంవత్సరాల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి హిందూపురం ఎంపీగా గెలుపొందారు. 2006లో అనారోగ్యంతో గంగాధర్ కన్నుమూశారు. వైసిపి ఆవిర్భావం తరువాత గంగాధర్ కుటుంబ సభ్యులు ఆ పార్టీలో చేరారు. మంగమ్మ వైసిపి సమన్వయకర్తగా, సిఇసి సభ్యురాలుగా పని చేశారు. ఈమె కుమారుడు సానిపల్లి మహీధర్‌కు 2014లో పెనుకొండ మండల జడ్పీటీసీగా పోటీ చేయించి, జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించాలని వైసిపి భావించింది. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. అప్పటి నుంచి వారు రాజకీయాల్లో స్తబ్దుగా ఉంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో వైసిపి అధిష్టానం మంగమ్మను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సానిపల్లి మంగమ్మ

'విశ్వ' అజ్ఞాన కేంద్రాలుగా మార్చొద్దు

◆ ఎస్కెయు పాలకవర్గ చర్యలు రాజ్యాంగ విరుద్ధం ◆ విసి, రిజిస్ట్రార్ తీరుపై మండిపడుతున్న పౌర సమాజం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

విశ్వ విద్యాలయాలంటే విజ్ఞాన కేంద్రాలుగా పిలుచుకుంటారు. సమాజాన్ని పురోగమనం వైపు నడిపించే కేంద్రాలుగా భావిస్తుంటారు. కొత్త కొత్త పరిశోధనలు, శాస్త్ర ఆలోచనలు నిత్యం సంఘర్షించాల్సిన చోట వెనుకబడిన ఆలోచనలను అమలుకు సిద్ధపడే విధంగా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పాలకవర్గ పెద్దలు వ్యవహరించిన తీరుపై పౌర సమాజం మండిపడుతోంది. మృత్యుంజయ హోమం చేపడుతున్నట్టు ఎస్కెయు వైస్ ఛాన్సలర్ అధికారిక ప్రకటనివ్వడాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నారు. శాస్త్రీయ ఆలోచనల వైపు ప్రజలను నడిపంచాలని రాజ్యాంగం చెబుతుంటే, ఉన్నత విద్యా కేంద్రమైన విశ్వవిద్యాలయంలో ఇటువంటి చర్యలు చేపట్టడాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు.

మృత్యుంజయ హోమాన్ని నిలిపేయాలి
వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి

మూఢనమ్మకాలను పారదోలి విజ్ఞాన కేంద్రంగా విరజిల్లాల్సిన విశ్వవిద్యాలయంలో మృత్యుంజయ హోమం నిర్వహించేందుకు ప్రయత్నించిన ఎస్కెయు రిజిస్ట్రార్‌ను వెంటనే రీకాల్ చేసి చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. యూనివర్సిటీ విజ్ఞాన కేంద్రమే కాక కుల, మత, ప్రాంతీయ భావాలకు అతీతమై ఉమ్మడి భావాలకు నిలయంగా ఉంటుందని చెప్పారు. వారి సొంత స్థలాల్లో వ్యక్తిగత విశ్వాసాలను ఆచరించడం ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు. దీనికి విరుద్ధంగా ప్రభుత్వ స్థలాలు, అందులోనూ శాస్త్ర విజ్ఞానానికి కేంద్రంగా మారాల్సిన విశ్వవిద్యాలయంలో ఇలాంటివి జరపాలని ప్రయత్నించడం లౌకిక భావాలకే తీవ్ర ప్రమాదం అని చెప్పారు. ఎస్కెయు విసి, రిజిస్ట్రార్ ఇద్దరూ సైన్సు విభాగాల్లో పరిశోధనలు చేసిన వారు అయి ఉండి, మృత్యుంజయ హోమం పేరుతో అశాస్త్రీయ కార్యక్రమానికి సిద్ధపడడం సరికాదన్నారు. వెంటనే యూనివర్సిటీలో మృత్యుంజయ హోమాన్ని నిలిపేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై లౌకిక, ప్రజాతంత్ర వాదులందరూ స్పందించాలని ఆయన కోరారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం
మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్.

శాస్త్రీయ ఆలోచనలను విద్యార్థి దశ నుంచే పెంపొందించాలని భారత రాజ్యాంగం సూచిస్తోంది. కాని అందుకు విరుద్ధంగా ఎస్కెయులో విసి, రిజిస్ట్రార్‌లు మృత్యుంజయ హోమం నిర్వహించడం అన్నది ఆ స్ఫూర్తిగా విరుద్ధంగా నిలుస్తాయి. విశ్వవిద్యాలయాలు అంటే ఆధునిక భావాలక, శాస్త్రీయ ఆలోచనలకు కేంద్రాలుగా ఉంటాయి. అనారోగ్యాల పేరుతో ఇటువంటి హోమాలను నిర్వహించడం ద్వారా ప్రయోజనం ఏమీ ఉండదు. అనారోగ్య సమస్యలుంటే ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించుకునే విధంగా చర్యలు తీసుకోవాలి గానీ, ఇటువంటి హోమాలతో విశ్వవిద్యాలయంలో మార్పులు జరగవని గ్రహించాలి.





విసి, రిజిస్ట్రార్‌ను తొలగించాలి
సూర్యసాగర్, జనసాహితీ సంస్థ.

మూఢ విశ్వాసాలను విద్యార్థుల్లో పెంచే విధంగా వ్యహరించిన వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌లను తక్షణం పదవి నుంచి తొలగించాలి. పౌర సమాజం కూడా ఇటువంటి చర్యలను ఉపేక్షించరాదు. దీనికి వ్యతిరేకంగా గొంతెత్తాలి. ప్రభుత్వం తక్షణం స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలి.

హోమాలతో ప్రాణాలు నిలవవు..
తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, మానవతా రక్తదాతల సంస్థ.

మృత్యుంజయ హోమాలు చేపట్టడం ద్వారా ఎవరి ప్రాణాలు నిలబడవన్నది అందరికీ తెలిసినదే. ఇటువంటి సమయంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఎటువంటి సందేశాన్ని విసి, రిజిస్ట్రార్‌లు ఇవ్వాలనుకున్నారో... విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే విధంగా వ్యవహరించాల్సిన అధ్యాపకులు ఈ రకంగా వ్యవహరించడం సరైంది కాదు. ఇప్పటికే భూతవైద్యం పేరుతో కోర్సులు, వాస్తు, జ్యోతిష్యం వంటి అశాస్త్రీయ కోర్సులను విద్యాలయాల్లో అమలు చేస్తున్నారు. ఇది మరింత తారా స్థాయికి చేర్చి హోమాలు నిర్వహిస్తున్నారు. ఇటువంటి వాటిని అరికట్టే చర్యలు చేపట్టాలి.

విద్యాలయాల్లో ఇలాంటివి తగదు..
గోవిందరాజులు, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్.

పూజలు, హోమాలు నిర్వహించుకోవడం అన్నది వ్యక్తిగతమైన అంశాలుగా ఉండాలి.అటువంటి వాటిని విద్యాలయాల్లో అధికారికంగా నిర్వహించడం సరైంది కాదు. విద్యాలయాలు కులాలు, మతాలకు అతీతంగా ఉండాలని రాజ్యాంగం సైతం సూచిస్తోంది. వీటన్నింటినీ పక్కనబెట్టి అధికారిక హోదాలో నిర్వహించాలని తలపెట్టడం సరైంది కాదు.

లౌకిక స్ఫూర్తికి విరుద్ధం : సిఐటియు

శ్రీకృష్ణదేవరాయల విశ్వ విద్యాలయంలో నిర్వహించ తలపెట్టిన మృత్యుంజయ హోమం దేశ లౌకిక స్ఫూర్తికి విరుద్ధమని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్ర కుమార్‌లు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ విశ్వవిద్యా లయంలో విజ్ఞానాన్ని పెంపొందించాల్సింది పోయి, ఇలా మూఢ నమ్మకాలను ప్రేరేపించేలా మృత్యుంజయ హోమం నిర్వహించడం సరికాదన్నారు. ఇతర మైనార్టీ వర్గాల భావాలను దష్టిలో పెట్టుకుని లౌకిక తత్వాన్ని మతసామరస్యాన్ని కాపాడే పద్ధతిలో యూనివర్సిటీలు ఉండాలన్నారు. తక్షణం మృత్యుంజయ హోమాన్ని రద్దు చేయాలని కోరారు.



విసికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు

హోమాన్ని అడ్డుకుంటాం

విద్యార్థి సంఘాలు

మూఢ విశ్వాసాలను ప్రోత్సహించేలా ఎస్కెయు అధికారులు చేపట్టిన మృత్యుంజయ హోమాన్ని ఆపకుంటే తామే అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. హోమం నిర్వహణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్కెయు విసి రామకష్ణారెడ్డి ఛాంబర్ వద్ద సోమవారం ఉదయం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్ర యాదవ్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కార్యదర్శులు ఓతురు పరమేష్, బాబావలి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయిస్వామి, చిరంజీవి మాట్లాడుతూ వైస్ ఛాన్సలర్ రామకష్ణారెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్యలు ఈ నెల 24వ తేదీన యూనివర్సిటీలో మత్యుంజయ హోమాన్ని జరపాలని నిర్ణయించడం సరికాదన్నారు. ఇందుకోసం డబ్బులను సైతం వసూలు చేసేలా సర్క్యులర్ జారీ చేశారన్నారు. ఉన్నత విద్యకు నిలయమైన ఎస్కెయులో ఇలా మూఢనమ్మకాలను ప్రోత్సహించడం సరికాదన్నారు. ఇది దేశ లౌకిక భావాలను దెబ్బతీసే విధంగా ఉందన్నారు. తక్షణం మత్యుంజయ హోమాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే 24న జరిగే హోమాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు.

మారని సచివాలయ సిబ్బంది తీరు



యూనిఫాం లేకుండా విధులకు హాజరైన సచివాలయ ఉద్యోగులు

విధి నిర్వహణలో నిర్లక్ష్యం

పాటించని డ్రస్‌కోడ్ నిబంధన

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

నంబులపూలకుంట మండలంలోని పలు గ్రామ సచివాలయాల సిబ్బంది తీరు మారలేదు. సాక్షాత్తు కలెక్టర్ చెప్పినా వీరు తీరు మారకపోవటంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రం సచివాలయం 1, 2 సచివాలయాలకు ఒకే భవనం ఉంది. ఇక్కడ పనిచేసే సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా డ్రస్‌కోడ్ పాటించాలి. గత నెలలో కలెక్టర్ మండల పర్యటనకు వచ్చిన సందర్భంగా డ్రస్‌కోడ్ నిబంధనపై సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిబంధన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే కలెక్టర్ ఆదేశాలను కూడా ఇక్కడి సిబ్బంది పాటించడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. సోమవారం కార్యాలయ విధులకు హాజరైన సచివాలయ సిబ్బంది డ్రస్‌కోడ్ పాటించలేదు. ఇదే కాకుండా విధి నిర్వహణలో కూడా ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. సచివాలయ ఉద్యోగుల డ్రస్‌కోడ్ విషయంపై ఇఒఆర్‌డిని వివరణ కోరగా జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల ప్రకారం సిబ్బంది తప్పనిసరిగా యూనిఫామ్‌లో రావాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లయితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అభివృద్ధి పనుల్లో పురోగతి కన్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో వారంలోగా అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను కలెక్టర్ బసంత్ కుమార్ హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గృహ నిర్మాణాలు , నాడు నేడు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు, సచివాలయ సేవలపై ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ శాఖ డిఇలు, ఎఇలు తదితర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామూహిక గృహప్రవేశాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం ఉండగా జిల్లాకు సంబంధించి జగనన్న లే అవుట్ లలో 10,600 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సుందన్నారు. అయితే ఇప్పటివరకు 4150 పూర్తి అయ్యాయని మరో 6450 ఇళ్ళు పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు సకాలంలో పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పూర్తిస్థాయిలో సమాచారం లేదని వారి వద్ద పూర్తి సమాచారం ఉండాలని అన్నారు. నాడు నేడు క్రింద పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ తదితర భవనాలు ఇంకా చేపట్టలేదని ఎందుకు మొదలు పెట్టలేదో తనకు సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యాలతో డేటాను ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలన్నారు. కేటాయించిన లక్ష్యాలను చేరుకోవడానికి అభివృద్ధి సాధించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పిడి చంద్రమౌళి రెడ్డి, పంచాయితీ రాజ్ ఇఇ మురళీమోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

గతపాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం రహమత్‌పురం

ఎమ్మెల్సీ ఇక్బాల్

ప్రజాశక్తి- హిందూపురం

గత పాలకుల నిర్లక్ష్యానికి పట్టణంలోని రహమత్‌పురం నిదర్శనంగా నిలిచిందని వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఎమ్మెల్సీ ఇక్బాల్ విమర్శించారు. సోమవారం పురపాలక సంఘంలోని 16వ వార్డు రహమత్‌పురం ప్రాంతంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డిఎన్ ఇంద్రజ, వైస్ చైర్మెన్ జబివుల్లా, వార్డు ఇన్‌ఛార్జి సలీం, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ, తదితరులు

గిన్నీస్‌బుక్ రికార్డులో డా॥మల్లికార్జున

కురుబసంఘం ఆధ్వర్యంలో సత్కారం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గిన్నీస్ బుక్ స్థానం దక్కించుకున్న డాక్టర్ మల్లికార్జునను కురుబ సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. దేశాల కాలింగ్ కోడ్ లతో గిన్నిస్ వరల్డ్ రికార్డును సాధించిన డా.మెజారి మల్లికార్జునను కురుబసంఘం నాయకులు స్థానిక శ్రీసాయి ఆరామం లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా నాయకులు సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో కురుబ సంఘం నాయకులు వారి మిత్రులు సత్య సాయి బాబా వారి చిత్రపటం బహుకరించి శాలువాతో సత్కరించి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా సదుం మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన చిన్న మల్లయ్య రాజమ్మల కుమారుడు డాక్టర్ మేజారి మల్లికార్జున రెండోసారి గిన్నిస్ బుక్ రికార్డు సాధించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఒక్క నిమిషంలో ఎక్కువ దేశాల కాలింగ్ కోడ్‌లను గుర్తించిన వ్యక్తిగా మల్లిఖార్జున ప్రపంచ రికార్డు నెలకొల్పాడని చెప్పారు. గతంలో చెన్నైకి చెందిన వ్యక్తి ఒక్క నిమిషంలో 51 దేశాలు కాలింగ్‌కోడ్‌లను గుర్తించగా మల్లికార్జున ఒక నిమిషంలో 56 దేశాల కాలింగ్‌కోడ్‌లను గుర్తించి రికార్డు సృష్టించాడన్నారు. గతంలో కూడా యోగాలో ఒక రికార్డు నెలకొల్పిన మల్లికార్జున ఇప్పుడు ఈ రికార్డు సాధించడంతో రెండు గిన్నిస్ రికార్డులు సాధించిన వ్యక్తిగా అరుదైన గుర్తింపు పొందాడని అన్నారు. మల్లిఖార్జునది వ్యవసాయ కుటుంబమని, అతని తల్లిదండ్రులు వ్యవసాయం మీదే ఆధారపడి జీవితం సాగిస్తున్నారని చెప్పారు. మల్లిఖార్జున పాఠశాల విద్యాభ్యాసం నడిగడ్డ ప్రాథమిక ఉన్నత పాఠశాల, తర్వాత చిత్తూరు జిల్లా జవహర్ నవోదయ విద్యాలయంలో జరిగిందని అన్నారు. ఆ తరువాత పుట్టపర్తి లోని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి విశ్వవిద్యాలయంలో బిఎ, ఎంఎ ఎకనామిక్స్ చేసి 2022లో ఎకనామిక్స్ పిహెచ్‌డి కూడా పొందారన్నారు. ఒక సంవత్సరం పాటు విశాఖపట్నం జిల్లా భీమిలిలో యోగాలో పీజీ డిప్లమా కూడా చేశారన్నారు. తాను నెలకొల్పిన రికార్డు వీడియోలను లండన్ లోని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ వారికి పంపగా వారు దానిని సమీక్షించి కొత్త రికార్డుగా గుర్తిస్తూ మల్లికార్జునకు లండన్ నుంచి ప్రశంస పత్రాన్ని పంపారని వివరించారు. మల్లిఖార్జున ప్రస్తుతం తిరుపతిలో వీర ఎడ్యుకేట్ పేరుతో ఒక స్టార్టప్ కంపెనీ స్థాపించి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరియర్ గైడెన్స్, యోగా మొదలైన వాటిలో శిక్షణ ఇస్తున్నారని ప్రభుత్వం ఇలాంటి మట్టిలో మాణిక్యాలను గుర్తించి వారి మేధాశక్తికి పదును పెట్టిన వారికి గుర్తింపు కలిగే విధంగా సహాయక సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివానంద, కిష్టప్ప, కేసాని ఆదినారాయణ, గోరంట్ల కిష్టప్ప, వెంకట నారాయణ, రిటైర్డ్ ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ, లక్ష్మీనారాయణ, రమేష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



మల్లిఖార్జునను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

కొత్తచెరువు: మండలంలోని జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ ఎఇ రమణారెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా గతంలో జగనన్న కాలనీలో వెయ్యిమందికి పట్టాలు పంపిణీ చేశారని వీటి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

ఘనంగా అగ్నిగుండం మహోత్సవం

అమరాపురం : మండలంలోని హేమావతి సిద్దేశ్వరుడి ఆలయంలో అగ్నిగుండం మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రముఖ శైవ క్షేత్రమైన ఎంజేరు సిద్దేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. దేవాలయ కమిటీ ఛైర్మన్ మంజునాథ్, ఈవో నాగేంద్రప్రసాద్, సర్పంచి తిప్పేస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల సందర్భంగా ప్రజలకు సౌకర్యాలను ఏర్పాటు చేశారు. సోమవారం నిర్వహించిన అగ్నిగుండ మహోత్సవానికి మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న పెనుకొండ డీఎస్పీ హుసేన్‌పీరా, డిఎల్‌పిఒ బాలాజీ తదితరులు హాజరయ్యారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

చిలమత్తూరు : రబీ సీజన్లో పంటసాగు చేసిన రైతులు తమ పంట వివరాలను ఈ నెల 25లోపు నమోదు చేయించుకోవాలని ఎఒ వంశీకృష్ణ కోరారు. ఈ ఏడాది రబీసీజన్‌లో పంటసాగు గణనీయంగా పెరిగిందన్నారు. ఆ మేరకు పంట వేసిన ప్రతి రైతు వెంటనే ఆర్బీకే సిబ్బందితో తమ పంట వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు.

పేదల కడుపు నింపుతాం

ధర్మవరం టౌన్ : అన్నక్యాంటిన్ ద్వారా పేదలకు కడుపునింపుతామని టీడీపీనాయకులు పేర్కొన్నారు. నియోజవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ సూచనల మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ఆస్పత్రికి వచ్చే రోగులకు, వివిధ గ్రామాల నుండి వారపు సంతకు వచ్చే ప్రజలకు టీడీపీ నాయకులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవారికి కడుపు నింపే విధంగా టీడీపీ చర్యలు తీసుకుం టుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పురుషోత్తంగౌడ్, పరిశేసుధాకర్, రాయపాటి శివ, బొట్టుకిష్ట, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్జేడీపై చర్యలకు డిమాండ్

ధర్మవరం టౌన్ : ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి అధికారిగా కాకుండా అధికార పార్టీ ఎన్నికల ఏజెంటుగా వ్యవహరిస్తున్నారని, వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పోతలయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు శివ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల టీచర్‌ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించేందుకు అడ్డదారులు తొక్కుతూ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తూ కడప, కర్నూల్, అనంతపురం ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే రహస్య సమావేశాలు నిర్వహించారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, నవీన్, మనోజ్, మురళి, వినోద్, మహమ్మద్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాకు మాజీ సైనికుల మద్దతు

మడకశిర : వన్ ర్యాంక్ వన్ పెన్షన్ అవకతవకలకు విరుద్ధంగా న్యూఢిల్లీలో సోమవారం నిర్వహించిన మహా ధర్నాకు మడకశిర మండల మాజీ సైనికుల అసోసియేషన్ తన మద్దతు తెలిపారు. ఈసందర్భంగా నిర్వహించిన ర్యాలీలో అసోసియేషన్ నాయకులు, మాజీ సైనికులు పి.ఆర్ అంజిరెడ్డి, శ్రీనివాసులు, వెంకట రంగారెడ్డి, నరసింహమూర్తి నాయక్, రాధాకష్ణ నాయక్, చెన్నప్ప నాయక్, ప్రసాద్, నారాయణప్ప, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై హర్షం

కొత్తచెరువు : ఎమ్మెల్యే స్థానిక సంస్థల కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థులుగా చంద్రగిరి ఏసురత్నంచ జయమంగళ వెంకటరమణను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించడం పట్ల పుట్టపర్తి నియోజకవర్గం వడ్డెర సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో నెహ్రూ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు వెంకటరాముడు, ఆంజనేయులు, జయ చంద్రమోహన్, తిరుపతేంద్ర, మారెప్ప, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలు

రొద్దం : మండలంలో ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంలోని టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ కార్యాలయ ఆవరణంలో టింబక్టివ్, కలెక్టివ్, చిగురు, సంస్థల ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. అందులో భాగంగానే సోమవారం ఏర్పాటు చేసిన ప్రదర్శన అకట్టుకుంది. సైన్స్‌పై పరిజ్ఞానం, అవగాహన కోసం పిల్లలందరిని ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చిగురు కోఆర్డినేటర్ రామన్న తెలిపారు. మండలంలోని రొద్దం, దొడగట్ట,కోగిర, పెద్దమంతూరు, పెద్ద గువ్వల పల్లి కస్తూరిబా , మహాత్మ జ్యోతిరావ్ బాపూలే పాఠశాల విద్యార్థులు మొత్తం 72నమూనాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అనంత శక్తి సొసైటీ సిఇఒ లావణ్య, చిగురు సంస్థ రాధ దేవి, గంగప్ప, నరసింహమూర్తి, ఆనంద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

పుట్టపర్తి అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక విశ్రాంత, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి పోరాటానికైనా తాము సిద్ధమని జెఎసి నాయకులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సాయి ఆరామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జెఎసి సత్యసాయి జిల్లా అధ్యక్షుడు మొయిద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రకార్యవర్గం ఎటువంటి పోరాటానికి పిలుపునిచ్చినా తాము సిద్ధంగా ఉంటామన్నారు. 11 వ పిఆర్సీ లో పొందుపంచిన క్యాడర్ వారి స్కిల్స్‌ని సంబంధిత శాఖాధిపతులకు ఇంకా పంపలేదంటేఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత ఏంటో అర్థం అవుతోందన్నారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 26న చేపట్టబోయే ఉద్యమంలో ఉద్యోగులందరూ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీకి విరాళం

పుట్టపర్తి అర్బన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి పెనుకొండ డివిజన్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు 50 వేల రూపాయలు విరాళం అందజేశారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ బసంత్ కుమార్‌కు చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెనుకొండ డివిజన్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఉద్యోగులు 50 వేలు రూపాయలు అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ సమాజానికి అనేక సేవలు అందిస్తోందని చెప్పారు., విరాళంగా చెక్కును అందించిన ఉద్యోగులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు చెక్ అందజేస్తున్న అధికారులు



జగనన్న లే అవుట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, తదితరులు

అర్హులందరికీ పక్కాగృహాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఇల్లు లేని అర్హులందరికీ పక్కాగృహాలు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. కదిరి పట్టణ పరిధిలోని కుటాగుళ్ల సమీపాన అనంతపురం హైవే రోడ్డు ప్రక్కన గల ప్రభుత్వ భూమిలో జగనన్న కాలనీ ఏర్పాటు కోసం స్థలాన్ని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఎర్రగుంటపల్లి వద్ద, ఆరీవో కార్యాలయం ఎదురుగా, టిడ్కో గృహాల వెనుక భాగంలో జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి అర్హులకు పట్టాలు అందజేశామన్నారు. ఆ తరహాలోని మరో రెండు లేఅవుట్లను ఏర్పాటుచేసి అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి పట్టాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి : ఎమ్మెల్యే

పజాశక్తి -పెనుకొండ

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండలంలోని నాగలూరు, మావటూరు, గోనిపెంట, రాంపురం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక మూడున్నరేళ్లలో 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రహరీ ఏర్పాటుకు ఆర్థికసాయం



ఇస్తమా ఏర్పాట్లను పరిశీలిస్తున్న బత్తల హరిప్రసాద్, తదితరులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం పారిశ్రామిక వాడలోని మసజీద్ ఏ రసూల్ ప్రహరీ నిర్మాణానికి వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు ముతవల్లి, మసీదు పెద్దలు కదిరి కుమ్మరవాండ్లపల్లిలో డాక్టర్ హరిప్రసాద్‌ను ఆయన నివాసంలో కలిసి మసీదుకు ప్రహరీ నిర్మాణానికి సహకరించాలని కోరారు. స్పందించిన ఆయన రూ. 50వేలను అందజేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కె.ఎస్ బాహుద్దీన్, వైస్ ఎంపీపీ బత్తల ఆదినారాయణ , మాజీ సర్పంచి బత్తల వెంకటరమణ, ముతవల్లి టిఎం రఫీక్, ఇండస్ట్రియల్ చైర్మన్ నౌషాద్, షైక్‌షా, బుల్లెట్ ఆయూబ్, బాషా, ఇంతియాజ్, అంజాద్, బత్తల యువ సేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇస్తమా ఏర్పాట్లు పరిశీలన

రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లిలో మార్చి 3, 4 వ తేదీల్లో జరిగే ఇస్తమాకు అన్ని విధాల సహకరిస్తామని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు కుమ్మరవాండ్ల పల్లిలో జరుగుతున్న ఇస్తిమా ఏర్పాట్లను జమాత్ మత పెద్దలు, వైసిపి పట్టణ అధ్యక్షులు బాహుద్దీన్‌తో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఇస్తమా నిర్వహించే ప్రదేశంలో చదును చేయడానికి అవసరమైన ఖర్చును హరిప్రసాద్ భరించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఇస్తిమా నిర్వహనకు తన వంతు సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆన్సార్‌వలి, ఖతిబ్ షబ్బీర్, మహబూబ్ బాషా, సౌదీ అన్వర్, మస్తాన్ ఖాన్, జహాన్, ముబారక్, మెహబూబ్, బాబ్జాన్, ఇంతియాజ్, ఒడిసి బాషా, అమీన్, కిరణ్, ఏసు రత్నం, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతల సమస్యల పరిష్కారానికి పోరాటం : టిడిపి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

చేనేతల సమస్యల పరిష్కారానికి తెలుగుదేశం పార్టీ వైసీపీ ప్రభుత్వం పై పోరాటాలు సాగిస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, హిందూపుర పార్లమెంట్ టీడీపీ ప్రతినిధి పురుషోత్త గౌడ్ చెప్పారు. పట్టణ చేనేత అనుబంధ విభాగాలతో చేనేత సమస్యలపై స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా నియోజకవర్గంలో చేనేత రంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. టీడీపీ హయాంలో చేనేత రంగాలకు ఇచ్చే పట్టు సబ్సిడీ ప్రోత్సాహకాలు, ఆదరణ తదితర పథకాలు, బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు తదతర పథకాలు అన్నింటిని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక చేనేతలు ప్రధానంగా వాడే ముడిపట్టు సరకుల ధరలు రెండింతలు పెరిగిందన్నారు. నాలుగేళ్లలో చేనేతరంగం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై అధ్యయనం చేయడానికి చేనేత రంగానికి చెందిన నాయకులతో కూడిన ఒక కమిటిని ఏర్పాటుచేసుకుని ఆ కమిటి ద్వారా చేనేత సమస్యలపై వైసీపీకి నివేదించి పరిష్కారానికి ఒత్తిడి తెచ్చేవిధంగా చేనేత సమస్యలను రూపకల్పన చేయాలని సమావేశంలో తీర్మానించామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఫణికుమార్, శీలామూర్తి, లక్ష్మీనారాయణ. మాదనసుబ్బయ్య, క్రిష్ణాపురం జమీర్ అహమ్మద్, గోసల శ్రీరాములు, బీల్లే శీన, చిన్నారు విజయ్ చౌదరి, పల్లపు రవీంద్రతదితరులు పాల్గొన్నారు.

దేవరచెరువులో పడి మహిళ మృతి

ప్రజాశక్తి కదిరి అర్బన్ : పట్టణ పరిధిలోని దేవర చెరువు లో పడి మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని దొన్నికోట గ్రామానికి చెందిన లక్ష్మీదేవి (40)కొన్ని సంవత్సరాలుగా భర్తను వదిలేసి తల్లిదండ్రుల వద్ద కదిరి పట్టణంలోని నారాయణరెడ్డి వీధిలో నివాసం ఉండేది. ఈ నేపథ్యంలో లక్ష్మిదేవి మూడు రోజుల నుండి కనపడకపోవడంతో బంధువుల నివాసాలలో వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో దేవర చెరువులో మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లిన లక్ష్మిదేవి బంధువులు మృతదేహం లక్ష్మీదేవిగా గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ తెలిపారు.

దుకాణంలో మంటలు

కదిరి అర్బన్ : మదనపల్లి రహదారి ప్రక్కన ఉన్న గుజిరి దుకాణంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న పట్టణ సిఐ తమ్మిశెట్టి మధు, సిబ్బంది స్పందించి మంటల నివారణకు చర్యలు తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తచెరువు : మండల పరిధిలోనే మీర్జాపురం పంచాయతీ పాతదేవరపల్లికి చెందిన యువకుడు ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.... గ్రామానికి చెందిన పెద్ద లింగప్ప కుమారుడు పోతిరెడ్డి కదిరి ప్రాంతంలో తాగునీటి పథకంలో పనిచేస్తున్నాడు. పండుగ సందర్భంగా సొంత గ్రామానికి వచ్చి ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ఇరగల్లపల్లి రోడ్డు మీదుగా ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. తలమర్ల దాటిన తరువాత ద్విచక్రవాహనం కల్వర్టును ఢీకొనడంతో పోతిరెడ్డి పక్కనే ఉన్న గుంతలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. రోడ్డు మార్గాన వెళ్లే వ్యక్తులు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

పాలు, పెరుగు దుకాణాల్లో తనిఖీలు

మడకశిర రూరల్ : పట్టణంలో పాలు, పెరుగు విక్రయాలు జరిపే దుకాణాలపై తూనికలు కొలతల శాఖ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులు రావటంతో తూనికల కొలతల శాఖ అధికారి శివశంకర్, సిబ్బంది పట్టణంలోని పాలు పెరుగు విక్రయాలు జరిపేదుకాణాల్లో పాలు, పెరుగు కొనుగోలు చేశారు. అయితే అంబేద్కర్ సర్కిల్లో నందిని పాలు విక్రయించే వ్యాపారి ఎంఆర్‌పి కంటే అదనంగా ఐదు రూపాయలు ఎక్కువ తీసుకున్నారు. దీంతో కేసు నమోదు చేసి, అపరాధ రుసుము 20వేల రూపాయల విధించినట్లు తూనికలు కొలతల శాఖ అధికారి శివశంకర్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ బాలా ఆంజనేయులు తెలిపారు. ఎంఆర్‌పి కంటే అధికంగా విక్రయాలు జరిపితే 7989005014 అనే నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

కెజిబివి పరిశీలన

సోమందేపల్లి : మండల పరిధిలోని పాపిరెడ్డి పల్లి వద్ద ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను నేషనల్ హ్యూమన్ రైట్స్ స్టేట్ ఉమెన్స్ పోర్ట్ ఇన్‌ఛార్జి రాజేశ్వరి, డివిజనల్ సెక్రెటరీ వసంత సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగదిని, పిల్లలకు ప్రతిరోజు అందించే ఆహా్రం, విద్య సంబంధిత విషయాలను పిల్లలతో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సి సభ్యులు సుదర్శన్ రెడ్డి, హరికృష్ణ, కెజిబివి ఎస్ఒ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి : సిపిఎం

ప్రజాశక్తి -పెనుకొండ

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం సబ్ కలెక్టర్ కె. కార్తీక్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో 6 సంవత్సరాల కిందట ఎన్టీఆర్ కాలనీలో ఇంటి పట్టాలు ఇచ్చి ప్రభుత్వం గృహాలు నిర్మించిందన్నారు. ఈసందర్భంగా ఆకాలనీలో అంగన్వాడీ కేంద్రానికి స్థలం కేటాయించారన్నారు. ప్రస్తుతం ఆ స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకుంటున్నారన్నారు. అధికారులు స్పందించి ఆ ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు. దీంతో స్పందించిన సబ్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను అందించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. దీంతో తహశీల్దార్ స్వర్ణలత, ఆర్ఐ, విఆర్ఒ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కాలనీవాసులకు అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు లక్ష్మీనారాయణ, నరసింహులు, ఆంజనేయులు, సిపిఎం నాయకులు తిప్పన్న, బాబావలి, సిఐటియు నాయకులు వజ్రం నాగప్ప, రెడ్డప్ప రెడ్డి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శుద్ధ జల కేంద్రాలను ప్రారంభించాలని వినతి : వేసవిలో తాగునీటి సమస్య లేకుండా నియోజకవర్గంలోని సోమందేపల్లి మండలంలో శుద్ధ జల కేంద్రాలను ప్రారంభించాలని సిపిఎం మండల కార్యదర్శి రాజగోపాల్ కోరారు. ఈ మేరకు నాయకులు సబ్ కలెక్టర్ కె. కార్తీక్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమందేపల్లి మండల కేంద్రంలో దాదాపు 20 వేల జనాభా కలిగి ఉందన్నారు. అత్యధికంగా చేనేత కార్మికులు దినసరి కూలీలుగా, భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. పాలకులు మారుతున్న గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కాలదన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా సోమందేపల్లి మండలంలో శుద్ధజల కేంద్రాలను ఏర్పాటు చేయలదన్నారు. అధికారులు,పాలకులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ మండల కార్యదర్శి చాంద్‌బాషా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి, చేనేత కార్మిక సంఘం నాయకులు గంగరాజు, శ్రీకాంత్, భవన నిర్మాణ కార్మికులు రవి తదితరులు పాల్గొన్నారు.



అధికారికి సమస్యను వివరిస్తున్న నాయకులు

మినీ రగ్బీ పోటీల్లో
ఉమ్మడి జిల్లా బాలికల జట్టుకు బంగారు పతకం

ప్రజాశక్తి-హిందూపురం

మినీ రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా బాలికల, బాలుర జట్లు ప్రతిభ కనబరిచి మొదటి, తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ నెల 17, 18వ తేదీల్లో ప్రకాశం జిల్లా రాయవరం గురుకుల పాఠశాలలో అండర్-11 మినీ బాలికల రగ్బీ రాష్ట్రం స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఉమ్మడి అనంత జిల్లా బాలికల జట్టు మొదటి నుంచి ఆధిపత్యం కొనసాగిస్తూ ఫైనల్‌కు చేరింది. ఫైనల్‌లో ప్రకాశం జిల్లా జట్టుపై విజయం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుంది. అలాగే ఉమ్మడి అనంత జిల్లా బాలుర జట్టు మూడవ స్థానానికి జరిగిన పోటీల్లో ప్రకాశం జట్టుపై విజయం సాధించింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో బాల, బాలికల జట్లు ప్రతిభ కనబరచడంతో జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, కార్యదర్శి యాసిన్ మాలిక్. రగ్బీ డైరెక్టర్ ముస్తఫా కమల్ బాషా, సభ్యులు అశ్విని, వెంకటేష్, సురేష్, ముస్తకీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో పాటు పిఇటిలు రూపవతి, మల్లికార్జున, విష్ణులను అభినందించారు.



బంగారు పతకం సాధించిన జట్టు సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి శైలజ

అంకితభావంతో ఆశయసాధనకు కృషి
అదనపు జిల్లా జడ్జి శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు ఆశయ సాధనకు అంకితభావంతో కృషి చేయాలని అదనపు జిల్లా జడ్జి శైలజ సూచించారు. సోమవారం స్థానిక ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాల్లో వేర్వేరుగా జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొన్నారు. విద్యార్థి దశ చాలా కీలకమైందని దూరాలవాట్లకు దూరంగా ఉంటూ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ సంస్కారవంతమైన ఉత్తమ పౌరులుగా ఎదగాలని తెలిపారు. ముఖ్యంగా యువత ప్రేమ, చెడు అలవాట్లు వింత పోకడలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు చాంద్‌బాషా, తులసి, న్యాయవాదులు నవేరా, పార్వతి, రవికుమార్, ఈశ్వరప్ప, లోక్ అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెయు విసిపై చర్యలు తీసుకోవాలి : జెవివి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధన్వంతరి మహామృత్యుంజయ శాంతిహోమం పేరుతో మూఢనమ్మకాలను విశ్వవిద్యాలయంలో వ్యాప్తి చేస్తున్న ఎస్కేయూ వైస్‌ఛాన్సిలర్‌ను సస్పెండ్ చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ ఆదిశేషు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించాలన్నారు. వారిని అజ్ఞానంలోకి నెట్టేసే చర్యలు చేపట్టరాదన్నారు. విశ్వవిద్యాలయాలు ఒక అజ్ఞానం వెదజల్లే కేంద్రాలుగా, అధికార పార్టీలకు జైకొట్టే కేంద్రాలుగాను తయారైపోతున్నాయని వాపోయారు. ఎస్కేయూలో ఈనెల 24న ధన్వంతరీ మత్యుంజయ శాంతిహోమం చేయడానికి ఆ యూనివర్సిటీ విసి జీవో విడుదల చేసి అక్కడ పనిచేస్తున్న టీచింగ్ స్టాఫ్ ఒక్కొక్కరు రూ.500, నాన్ టీచింగ్ స్టాఫ్ ఒక్కొక్కరు రూ.100 లెక్కన ఇవ్వాలని రిజిస్ట్రార్ లక్ష్మయ్య ఒక సర్క్యులర్ విడుదల చేయం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విసిని సస్పెండ్ చేసి, రిజిస్ట్రార్ జారీచేసిన జీవోను రద్దుచేసి భవిష్యత్తులో ఇలాంటి చాదస్తపు అనాగరిక పనులు చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సచివాలయం తనిఖీ

గాండ్లపెంట : మండల పరిధిలోని మల్ల మీద పల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీపీ తాతం జగన్మోహన్ యం సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బంది హాజరు రిజిస్టరును పరిశీలించారు. సిరికల్చర్ అసిస్టెంట్ సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరవడంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని స్థానిక వ్యవసాయ అధికారిని లక్ష్మీప్రియను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నేనే రాజు... నేనే మంత్రి...

ఆ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌దే హవా

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మండలంలోని గంగలాయిపాలెం గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ తీరు వివాదాస్పదంగా ఉంది. 'నేనే రాజు.. నేనే మంత్రి' అన్న తరహాలో పెత్తనం కొనసాగిస్తోందన్న విమర్శలు వినపడుతున్నాయి. సచివాలయంలో పనినిమిత్తం ఎవరైనా వస్తే తప్పనిసరిగా తన అనుమతి తీసుకుని రావాలంటూ హుకుం జారీ చేస్తోంది. దీంతో ఈ ఉద్యోగి పనితీరుపై పలు విమర్శలు వినపడుతున్నాయి.

మడకశిర మండలం గంగలవాయిపాలెం గ్రామ సచివాలయంలో కొంతమంది సచివాలయ ఉద్యోగుల పనితీరు గాడి తప్పుతోంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకొస్తే వీరి నిర్వాకం మూలంగా ఆయన ఆశయాలకు తూట్లు పడుతున్నాయి. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. కొన్నిసార్లు ఉదయం 11గంటలు అయినా సచివాలయం తాళం తీయని పరిస్థితి ఉందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు తమ విధులకు ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు వెళ తున్నారో తెలియని పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. పలు సమస్యలపై ప్రజలు సచివాలయం వద్దకు వెళితే వారి నుంచి సరైన స్పందన లభించడం లేదని విమర్శిస్తున్నారు. ప్రధానంగా సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ పనితీరుపై ప్రజలు పలు ఆరోపణలు చేస్తున్నారు. సచివాలయంలోకి వచ్చే వారు తన అనుమతి తీసుకున్న తర్వాతనే రావాలని హుకుం జారీ చేస్తున్నారు. సోమవారం గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వో ఉన్నారు. ఈ నేపథ్యంలో పాత్రికేయులు సచివాలయంలోకి వెళ్లారు. ఆసమయంలో డిజిటల్ అసిస్టెంట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా సరే తమ అనుమతి లేనిదే లోపలికి రాకూడదని హుకుం జారీ చేశారు. కార్యాలయంలో పలువురు సిబ్బంది లేకపోవటంతో ఖాళీకుర్చీలు దర్శనమివ్వటంతో విలేకరులు ఫొటోలు తీశారు. అది చూసిన డిజిటల్ అసిస్టెంట్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమని ప్రశ్నిస్తే ఎవరైనా లోపలికి రావాలంటే తన అనుమతి తీసుకోవాల్సిందే అని రాజరికాన్ని ప్రదర్శించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సిన అధికారి ఇలా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈమె తీరుకు భయపడి సమస్యలను చెప్పుకోవటానికి గ్రామస్తులు జంకుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇక సచివాలయంలో వాలెంటీర్లపై కూడా తన దర్పాన్ని ప్రదర్శిస్తుంటోందని, చీటికి మాటికి వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తుంటుందని స్థానికులు అంటున్నారు. ఈ ఉద్యోగి వ్యవహారం ఎంపిడిఒ దృష్టికి వెళ్లినా ఆ అధికారి కూడా సరిగా స్పందించడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సచివాలయాలను తరచూ తనిఖీ చేసి సిబ్బంది పనితీరును సమీక్షించాలని, ప్రజలతో ఉద్యోగులు ప్రవర్తించాల్సిన పద్ధతిపై అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు